క్లుప్తంగా

ఎన్నికల విధుల్లో 552 మంది సిబ్బంది



ఎన్నికల విధుల్లో చేరిన సిబ్బంది

నవాబుపేట: మండలంలో నేడు (గురువారం) జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో 552 మంది సిబ్బంది పాల్గొననున్నట్లు తహసీల్దార్ జయరాం తెలిపారు. మండలంలో మొత్తం 36,519 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 18,526 మంది, మహిళలు 17,993 మంది ఉన్నారు. మొత్తం 46 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 100 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ భరత్‌భూషన్ తెలిపారు. మండలంలోని ఎక్‌మామిడి, ఎల్లకొండ గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించి కేంద్ర బలగాలతో భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

బూత్‌లకు చేరిన సిబ్బంది



దారూరు: పోలింగ్ సామగ్రితో వెళ్తున్న సిబ్బంది

ధారూరు: నేడు జరగనున్న ఎన్నికల కోసం సిబ్బంది బుధవారం రాత్రి వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మండలాన్ని 5 రూట్లుగా చేసి వాటికి సెక్టోరియల్ ఆఫీసర్లను నియమించారు. మండలంలో మొత్తం 47 బూత్‌లను ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 34,751 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 17,213, మహిళలు 17,538 మంది ఉన్నారు. గట్టెపల్లి, రుద్రారం బూత్‌లను మోడల్ పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. ఆరుగురు కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాలిటెక్నిక్ విద్యార్థి ఆత్మహత్య



రాజు

అనంతగిరి: వికారాబాద్ పట్టణ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్ మియాపూర్‌కు చెందిన రాజు(20)అనే విద్యార్థి ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ప్రస్తుత ఎన్నికల కారణంగా విద్యాసంస్థలకు సెలవు ఇవ్వడంతో చాలా మంది విద్యార్థులు వారి వారి ఇళ్లకు వెళ్లడం, అధ్యాపకులు, సిబ్బంది ఎన్నికల బిజీలో ఉండటంతో కొంతమంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. అయితే బుధవారం సాయంత్రం కళాశాలలో వంట చేసే వ్యక్తి గదిలోకి వెళ్లి చూడగా రాజు ఫ్యాన్‌కు వేలాడుతూ కన్పించాడు. దీంతో వెంటనే కళాశాల ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇవ్వగా ప్రిన్సిపాల్ పోలీసులకు ఫోన్ ద్వారా విషయం తెలియజేశాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అయితే, విద్యార్థి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడనే వివరాలు తెలియరాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ

కందుకూరు: మండలంలోని కొత్తూర్‌కు చెందిన గురుస్వామి మీగడి చెన్నకేశ్వర్ ముదిరాజ్ 18వ మెట్టు అయ్యప్పస్వామి మహాపడి పూజను వైభవంగా నిర్వహించారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అయ్యప్పదాసన్ పి.కేశవ్ గురుస్వామి, ఎ.కుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో పడి పూజను జరిపించారు. అంతకు ముందు స్వామికి అభిషేకం, పూజ, 18వ సారి మాలాధారణ చేసిన చెన్నకేశ్వర్‌ముదిరాజ్‌ను ప్రత్యేకంగా సన్మానించి స్వామి వారి ఆశీస్సులు అందించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కేఎల్లార్, ఏనుగు జంగారెడ్డి తదితరులు హాజరై పూజలు చేశారు.

గుర్తింపు కార్డు తప్పనిసరి

షాద్‌నగర్: ఎన్నికలు మరికొద్ది గంటల్లో ప్రారంభం కానున్నాయి. అధికారులు ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓటర్లకు పోలింగ్ చిట్టీలను ఇప్పటికే పంపిణీ చేశారు. ఓటరు జాబితాలో పేరు ఉన్నా చాలా మందికి పోలింగ్ చిట్టీలు అందలేదు. ఓటరు కార్డు లేనివారు ఓటు వేయాలంటే ఫొటో గుర్తింపు కార్డు వెంట తీసుకెళ్లాలి.

ఓటరు స్లిప్‌తో..

ఓటు వేసేందుకు వెళ్లే వారు ఈ కింద తెలిపిన గుర్తింపు కార్డుల్లో ఒకటి తప్పని సరి వెంట తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఓటరు గుర్తింపు కార్డు ఉన్న వారికి ఓటరు స్లిప్ నెంబర్ రాసి ఇస్తారు. ఫొటో ఓటరు స్లిప్, ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, రేషన్‌కార్డు, పాన్‌కార్డు, పాస్‌పోర్టు, సర్వీసు గుర్తింపు కార్డు, బ్యాంక్‌పాస్‌బుక్ (ఫొటోతో ఉండాలి, మొదటి పేజీ ఉంటే సరిపోతుంది), పోస్టాఫీసు పాస్‌బుక్, స్మార్ట్‌కార్డు, పెన్షన్ పత్రం, ఎంఎస్ఆర్ఈజీఏ జాబ్‌కార్డు సరిపోతుంది.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తి చేసిన ఎన్నికల అధికారులు
- తాండూరులో పోలింగ్ బూత్‌లకు చేరుకున్న సిబ్బంది
- బందోబస్తుకు 400 మంది పోలీసు బలగాలు
- బూత్‌ల వద్ద 144 సెక్షన్ అమలు



తాండూరు: ఈవీఎంలను తీసుకుని పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న సిబ్బంది

తాండూరు: తాండూరు అసెంబ్లీ పరిధిలో ఎన్నికల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. బుధవారం పట్టణంలోని సెయింట్ మార్క్స్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ నుంచి ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చి ఈవీఎంల యంత్రాలతో గ్రామాలకు పోలీస్ బందోబస్తు మధ్య గ్రామాలకు చేరుకున్నాయి. అసెంబ్లీ పరిధిలో మొత్తం 269 పోలింగ్ బూత్‌లకు గాను 169 ఈవీఎం యంత్రాలను సిద్ధం చేశారు. అదనంగా మరో 107 ఈవీఎం యంత్రాలను సిద్ధంగా ఉంచుకున్నారు. 23 మంది సెక్టోరియల్ అధికారులు, 23 మంది ప్రిసైడింగ్ అధికారులు, 23 మంది రూట్ అధికారులు, 41 మంది అదనపు సిబ్బంది, 269 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 39 మంది అదనపు సహాయ సిబ్బంది, 538 మంది ఇతర పోలింగ్ అధికారులు, 80 మంది అదనపు సిబ్బంది, సూక్ష్మ పరిశీలకులు 54, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్ కోసం 173 మంది 18 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంలు, పోలింగ్ లోకేషన్ నోడల్ అధికారులు 155 మందితో ఎన్నికలకు సమాయత్తం చేశారు. వృద్ధులు, వికలాంగులు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు రావడానికి 155 వాహనాలు, వీల్‌చైర్‌లను సమకూర్చారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

ఎన్నికల అధికారులు, సిబ్బంది బుధవారం సాయంత్రం వరకు పోలింగ్ బూత్‌లకు చేరుకున్నారు. ఈవీఎం పంపిణీ కేంద్రం నుంచి బూత్‌లకు వెళ్లేందుకు 37 బస్సులు, 20 మినీ బస్సుల ద్వారా కేంద్రాలకు చేరుకున్నారు.

మర్పల్లి మండలంలో..

మర్పల్లి: నేడు జరగనున్న ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎన్నికల మండల మానిటరింగ్ అధికారి అనీల్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలో 27 గ్రామ పంచాయతీలకు గాను మొత్తం ఓటర్లు 43, 330 ఉండగా అందులో పురుషులు 22, 340, మహిళా ఓటర్లు 20,990 ఓటర్లు ఉన్నారని తెలిపారు. మండలంలో మొత్తం 58 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసామన్నారు. 58 పోలింగ్ బూత్‌లకు 240 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తారని చెప్పారు. ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు మాస్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్ తెలిపారు.

మోమిన్‌పేటలో 37,707 మంది ఓటర్లు

మోమిన్‌పేట: ఓట్ల సందడి మొదలైంది.. అన్ని పోలింగ్ కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలం పరిధిలోని ఆయా గ్రామాల్లో నేడు 37,707మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పురుషులు 18,866 మంది, స్త్రీలు 18,841 మంది ఉన్నారు. మొత్తం 48 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సాధారణ ఎన్నికలను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అధికారులు పోలింగ్ శాతం పెంచేందుకు అన్ని ప్రయత్నాలు పూర్తి చేశారు. గ్రామాల బయట ఉన్న వారిని సైతం తీసుకువచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

భారీ బందోబస్తు

మోమిన్‌పేట: మోమిన్‌పేట సర్కిల్ పరిధిలో పోలింగ్ సజావుగా జరిగేందుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ ఆంజనేయులు పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలో ఒక డీస్పీ, ఇద్దరు సీఐలు, 9మంది ఎస్ఐలతో పాటు లోకల్ స్టాఫ్ 80 మంది పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. అలాగే, కర్నాటక రాష్ట్రానికి చెందిన హోంగార్డులు, ఫారెస్టు సిబ్బంది, జైళ్లశాఖకు చెందిన మొత్తం 180 మంది, కేంద్ర బలగాలు 30 మందితో భద్రతా చర్యలు తీసుకున్నామని వివరించారు. కాగా, 234 మందిని బైండోవర్ చేసినట్లు చెప్పారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ

కొడంగల్ : నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. బుధవారం పట్టణంలోని పంపిణీ కేంద్రం నుంచి ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు పంపించారు. నియోజకవర్గంలో 275 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. కొడంగల్‌కు 343 బ్యాలెట్ యూనిట్లు , 343 కంట్రోల్ యూనిట్లు, 385 వీవీ ప్యాట్లు పంపిణీ చేశారు. ఎన్నికలో ఏమైనా సాంకేతిక సమస్యలు ఏర్పడితే అప్పటికప్పుడు వాడుకునేందుకు 914 మిగులు బ్యాలెట్ యూనిట్లు, 428 మిగులు కంట్రోలు యూనిట్స్, 227 మిగులు వీవీ ప్యాట్లు రిజర్వులో ఉన్నాయి. ఎన్నికల విధుల కోసం పీఓ, ఏపీఓలు 316 మంది, ఓపీఓలు 632మంది, మైక్రో పరిశీలకులు 99 మందిని నియమించారు. నియోజకవర్గంలోని 8 మండలాల్లో మొత్తం 2 36, 625 మంది ఓటర్లు ఉన్నాయి.



తాండూరు: కుమారుడిని ఎత్తుకొని పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న మహిళ



మోమిన్‌పేట: సామగ్రి తీసుకెళ్తున్న సిబ్బంది



కొడంగల్ : విధులకు వెళ్తున్న పోలింగ్ సిబ్బంది



మర్పల్లి: పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న సిబ్బంది

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం



తాండూరు సబ్ డివిజన్ పరిధిలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా ప్రజలను చైతన్యం చేయడం జరిగింది. ఇప్పటి వరకు ఎన్నికల ప్రచారం ప్రశాంతంగా ముగిసింది. గురువారం జరిగే పోలింగ్ రోజున 400 మంది పోలీసు బలగాలను పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తుకు ఏర్పాటు చేయడం జరిగింది. అందులో తాండూరు సబ్ డివిజన్ పోలీసులు 100 మంది, కర్ణాటక రాష్ట్ర పోలీసులు 200 మంది, ప్రత్యేక బలగాలు 100 మంది ఎన్నికల విధులకు హాజరయ్యారు. సమస్యాత్మక గ్రామాలలో నిఘా పెట్టడం జరిగింది. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

–శేఖర్‌గౌడ్, డీఎస్పీ, తాండూరు

బంట్వారంలో 19,636 మంది ఓటర్లు

బంట్వారం: నేడు (గురువారం) జరిగే అసెంబ్లీ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. బంట్వారం మండలంలో 24 పోలింగ్ బూత్‌లకు సంబంధించి 19,636 మంది ఓటర్లు ఉన్నారు. కోట్‌పల్లి మండలంలో 18 గ్రామ పంచాయతీల గాను 26 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. వీటిలో ఐదు జీపీలు తాండూరు నియోజకవర్గం పరిధిలో ఉన్నాయి. కోట్‌పల్లి మండలానికి సంబంధించి 20,685 మంది ఓటర్లకు గాను 6052 మంది ఓటర్లు తాండూరు నియోజకవర్గం పరిధిలో ఉండగా 14,633 మంది ఓటర్లు వికారాబాద్ నియోజకవర్గంలో ఉన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు ఎన్నికల సిబ్బందిని నియమించినట్లు బంట్వారం, కోట్‌పల్లి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ప్రవీణ్‌కుమార్, ఆశాజ్యోతి తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్

మర్పల్లి: ప్రజలు ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని మోమిన్‌పేట్ సీఐ ఆంజనేయులు, మర్పల్లి ఎస్ఐ శ్రీధర్‌రెడ్డిలు పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. మండలంలో మొత్తం 58 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. బూత్‌కు 200 మీటర్లలోపు ఎవ్వరు ఎన్నికల ప్రచారం చేయరాదని ఓటు వేసేందుకు వచ్చే ప్రతి ఓటరు ఓటర్ స్లిప్‌తో పాటు గుర్తింపు కార్డును తీసుకువచ్చి ఓటు వేయాలన్నారు. సమస్యాత్మకమైన మర్పల్లి, పంచలింగాల, పట్లూర్, సిరిపురం గ్రామాల్లో పోలీస్ సిబ్బందితో పాటు 25 మంది కేంద్ర బలగాలు విధులు ఉంటారని తెలిపారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి

తహసీల్దార్ పురుషోత్తం



దోమ : అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని తహసీల్దార్ పురుషోత్తం కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. డబ్బు, మద్యం ఆశ చూపి ప్రలోభాలకు గురిస్తే సీ విజిల్ యాప్ ద్వారా అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వ్యక్తుల పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రం పరిశీలన



పంపిణీ కేంద్రాన్ని సందర్శించిన అబ్జర్వర్లు శిల్పాగుప్తా, జనార్దన్ , అజిత్ సింగ్‌లు

చేవెళ్ల: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా చేవెళ్లలోని ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని బుధవారం ఎన్నికల అబ్జర్వర్లు శిల్పాగుప్తా, జనార్దన్, అజిత్ సింగ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు చేవెళ్ల అసెంబ్లీలోని పోలింగ్‌బూత్‌ల వారీగా ఉద్యోగులకు ఎన్నికల సామగ్రి అందుతున్నాయా? లేదా ? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరిచూసుకోవాలని చెప్పారు. మొత్తం ఎన్నికల నిర్వహణ వివరాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాంను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూసుకోవాలని సూచించారు.

డ్రైవర్ నిర్లక్ష్యంతో మహిళ మృతి



సునీత (ఫైల్)

కడ్తాల్: ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన బుధవారం మండల కేంద్రంలోని ఓ రైస్ మిల్లులో చోటు చేసుకుంది. సీఐ శివ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్దావేములోని బావితండా గ్రామ పంచాయతీకి చెందిన రమావత్ రాజునాయక్, భార్య సునీత (28)తో కలిసి బుధవారం ఉదయం వరి ధాన్యం నూర్పిడి కోసం కడ్తాల్‌లోని సప్తగిరి రైస్ మిల్లుకు వెళ్లారు. మిల్లు ఆవరణలో డ్రైవర్ అజాగ్రత్తగా ట్రాక్టర్‌ను రివర్స్ చేస్తూ సునీతను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి కూతురు అంజలి, కుమారుడు రాంచరణ్ ఉన్నారు. రాజునాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు.

ఆహ్లాదంగా పోలింగ్ బూత్



కుల్కచర్ల: అందంగా తీర్చిదిద్దిన మాడల్ పోలింగ్ కేంద్రం

కుల్కచర్ల: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల కేంద్రంలో 135 పోలింగ్ బూత్‌ను మాడల్ పోలింగ్‌గా నిర్ణయించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే, 141పోలింగ్ బూత్‌ను మాడల్ ఉమేన్ పోలింగ్ బూత్‌గా ఎంపిక చేసి అందంగా, ఆహ్లాదకరంగా ముస్తాబు చేశారు. కుల్కచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, చాపలగూడెం పంచాయతీ కార్యదర్శి రవిలు ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షించారు.



మాడల్ ఉమెన్ పోలింగ్ కేంద్రం

పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది

- నేడు పోలింగ్
- ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం
- సామగ్రిని పంపిణీ చేసిన అధికారులు
- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఈవీఎంలు, వీవీప్యాట్‌లు
- ఓటు హక్కును వినియోగించుకోనున్న 2,36,338 మంది ఓటర్లు

షాద్‌నగర్: ప్రజలు తమ ఓటు హక్కుతో తమకనుకులమైన నేతను గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. అధికారులు ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మరి కొద్ది గంటల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో శాంతియుతంగా ఎన్నికలు జరిగేందుకు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

మొత్తం 255 పోలింగ్ కేంద్రాలు...

నియోజకవర్గంలోని కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ, కేశంపేట, కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్ మండలాల్లో మొత్తం 255పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఇందులో 91 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా పోలీసు అధికారులు గుర్తించారు. ఇలాంటి పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు ముందస్తుగానే పూర్తి చేశారు. పోలింగ్ కేంద్రంలో విద్యుత్, మంచినీరు వసతి కల్పించడంతో పాటు దివ్యాంగులకు, వృద్ధులకు ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు ఏర్పాటు చేశారు. అయితే ఈ సారి ఎన్నికల్లో మొత్తం 2,36,338 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

21 రూట్లలో విధుల్లో పోలింగ్ సిబ్బంది...

నియోజకవర్గంలో మొ త్తం 21 రూట్లను ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి కృష్ణ తెలిపారు. పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారితోపాటుగా అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, వెబ్ క్యాస్టింగ్ అధికారి, గార్డులు విధులు నిర్వహించనున్నారు. మొత్తం 1150 మంది పోలింగ్ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఆశా వర్కర్, ఏఎన్‌ఎంలు విధులు నిర్వహిస్తారు. మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు.

ఏర్పాట్ల పరిశీలన ..

ఎన్నికలకు పోలింగ్ సిబ్బంది కేటాయింపు, ఈవీఎంల అప్పగింత కార్యక్రమాన్ని బుధవారం పట్టణంలోని మినీస్టేడియంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను ఎన్నికల పరిశీలకుడు, ఐఏఎస్ అధికారి చంద్రకాంత్ కృష్ణారావు డాంగె, పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట మాధవరావు వివరాలను అడిగి తెలుసుకున్నారు.



ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి వెంకట మాధవరావు

బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితా

క్రసం	అభ్యర్థి	పార్టీ	గుర్తు
1.	అంజయ్య యాదవ్	బీఆర్ఎస్	కారు
2.	అందెబాబయ్య	బీజేపీ	కమలం
3.	ప్రశాంత్‌కుమార్	బీఎస్పీ	ఏనుగు
4.	వీర్లపల్లి శంకర్	కాంగ్రెస్	హస్తం
5.	విష్ణువర్ధన్‌రెడ్డి	ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్	సింహం
6.	మంచాల బిక్షపతి	ధర్మసమాజ్ పార్టీ	బ్యాటరీ టార్చ్
7.	ఎండీ ఖాజా ముఫిజుద్దీన్	జై స్వరాజ్ పార్టీ	పెన్ నిబ్
8.	రహమద్దీన్	ఆల్ ఇండియా సమతా పార్టీ	పలక
9.	వినయ్‌కుమార్	విద్యార్థుల రాజకీయ పార్టీ	బ్యాట్
10.	అందారి అంజయ్య	స్వతంత్ర	రూం కూలర్
11.	తుప్పుడు నర్సయ్య	స్వతంత్ర	గ్యాస్ సిలిండర్
12.	నర్సింహ్మ రుస్తుం	స్వతంత్ర	రోడ్డు రోలర్
13.	మంచాల చంద్రమౌళి	స్వతంత్ర	హార్మోనియం
14.	రాఘవేందర్	స్వతంత్ర	ఎయిర్ కండీషనర్

గ్రామాలకు తరలిన జనం

కిక్కిరిసిన బస్సులు, ప్రైవేటు వాహనాలు

మొయినాబాద్: అసెంబ్లీ ఎన్నికల కోసం ఓటు హక్కు వినియోగించుకోవడానికి ప్రజలు తమ సొంత ఊళ్లకు తరలారు. బతుకుదెరువుకోసం నగరంతో పాటు ఇతర జిల్లాలకు వెళ్లిన జనం తమ సొంత ప్రాంతాలకు చేరుకొని ఓటు వేయనున్నారు. హైదరాబాద్‌తోపాటు బండ్లగూడ, మొయినాబాద్ నుంచి వికారాబాద్ జిల్లా పరిగి, తాండూరు, కొడంగల్, నారాయణపేట జిల్లాకు చెందిన చాలా మంది బుధవారం సాయంత్రమే సొంత ప్రాంతాలకు వెళ్లారు. గురువారం ఓటు వేసేందుకు ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో తరలివెళ్లారు. కొడంగల్, పరిగి ప్రాంతాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుంది. బస్సుల్లో కిక్కిరిసి ఉండటంతో బస్సుటాప్‌పైన సైతం ఎక్కి సొంతూళ్లకు వెళ్తున్నారు.

సొంతూళ్లకు ఓటర్లు..

బండ్లగూడ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తమ ఓటును వినియోగించుకునేందుకు ప్రజలు తమ ఊళ్లకు పయనమయ్యారు. బతుకుదెరువు కోసం ఊళ్ల నుంచి వచ్చిన వారు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నివాసాలను ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలో ఉంటూ నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. నగర శివారు ప్రాంతం కావడంతో నగరానికి, ఊళ్లకు ఇది మధ్యలో ఉండటంతో ప్రజలు చాలా మంది బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జీవించేందుకు ఆసక్తి చూపుతుంటారు. కొడంగల్, తాండూర్, వికారాబాద్, చేవెళ్ల, షాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన వారు అధికంగా ఉంటుంటారు. ఇక్కడ నివసిస్తున్నప్పటికీ వారి చిరునామాలు, ఆధార్, ఓటర్‌కార్డులు అన్ని ఊళ్లకు సంబంధించినవే ఉంటాయి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఈనెల 30న ఉండటంతో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రజలు బుధవారం తమ సొంతూళ్లకు బయలుదేరారు.



మొయినాబాద్: హైదరాబాద్ నుంచి నారాయణపేటకు టాప్‌పై కూర్చుని వెళ్తున్న ప్రజలు

మా ఓట్లకు ఎంతిస్తారు!

కందుకూరు: నెల రోజుల పాటు సాగిన ఓట్ల జాతరకు ముగింపు సమయం ఆసన్నమైంది. హామీలు, ఆరోపణలు, విమర్శలే ప్రధాన అస్త్రాలుగా అభ్యర్థులు తమ ప్రచారాన్ని హోరెత్తించారు. పోలింగ్‌కు ఒక్క రోజు మాత్రమే సమయం ఉండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటర్లను చివరి నిమిషంలో ప్రసన్నం చేసుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. తమ అనుచరులను పంపించి నగదు పంపిణీకి తెర లేపారు. ప్రజలు సైతం ఏ పార్టీ వారు ఎంతఇస్తారోనని తలుపులు తెరిచి ఉంటున్నారు. తమకు ఓట్లు వేస్తారనే నమ్మకం ఉన్న ఓటర్లకు మాత్రమే ఓ పార్టీ అభ్యర్థి పంపిణీ చేయిస్తుండగా, మరో పార్టీ అంత కంటే ఎక్కువ మందికి ఇస్తున్నట్లు సమాచారం. మూడో ప్రధాన పార్టీ బుధవారం సాయంత్రం వరకు నగదు పంపిణీ ప్రారంభించలేదు. ప్రధాన పార్టీల పంపిణీ ముగిసిన తర్వాత వారు ఎంత మేర ఇచ్చారో చూసుకుని, రాత్రి వేళ పంపిణీ చేయడానికి నిరీక్షిస్తుంది. కాగా ఒక్కో పార్టీ దాదాపుగా రూ.వెయ్యి వరకు పంపిణీ చేసినట్లు సమాచారం. కాగా సందడిలో సడేమియగా గ్రామాల్లో కొందరు నాయకులు ఓటర్లకు పంచే నగదులో కొంత మిగిలిచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో గ్రామంలో కొందరికీ రూ.వెయ్యి మరికొందరికీ రూ.500 వరకు పంపిణీ చేస్తున్నారు. దీంతో పక్క వారి కంటె తక్కువ వచ్చిన వారు గొడవకు దిగుతున్నారు.